

15న వికాస కార్యాలయంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 15న కలెక్టరేట్ ప్రాంగణంలోని వికాస కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.ఎల్.రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు కంపెనీలు హాజరవుతాయని తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లొమా, బి.టెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.30 వేల వరకూ వేతనం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈ నెల 15న వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌తో హాజరవ్వాలన్నారు. వివరాలకు 7799376222 www.vikasajobs.comలో సంప్రదించాలన్నారు.

ఉప్పాడకు తప్పని కోత..

- పూర్తిగా ధ్వంసమైన రహదారి
- రక్షణ గోడ నిర్మాణానికి కూటమి హామీ
- రూ.323 కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు
- కేంద్రం నిధులు విడుదల చేస్తేనే మోక్షం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ వద్ద తీర ప్రాంతం అలల తాకిడికి అల్లాడుతోంది. ప్రధానంగా కాకినాడ నుంచి ఉప్పాడ రోడ్డు మార్గం అలల ఉధృతికి ధ్వంసం అవుతోంది. రోడ్డుకి రక్షణగా వేసిన పెద్ద పెద్ద బండ రాళ్లు సైతం అలల దాటికి సముద్రంలో కలుస్తున్న పరిస్థితి నెలకొంది. నివాస గృహాల సంగతి చెప్పనక్కర్లేదు. కొన్నేళ్లుగా వందల ఇళ్లు సముద్రంలో కలిసిపోయాయి. రెండు రోజులుగా ఏర్పడిన అల్పపీడనం కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారింది. తీరం అంతా గందరగోళంగా కనిపిస్తోంది. బీచ్ రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో తీర ప్రాంత రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. 14.5 కిలోమీటర్ల మేర రక్షణ గోడ నిర్మాణానికి రూ.323 కోట్లతో అభివృద్ధి ప్రయత్నాలు సాగిస్తున్నారు.

50 ఏళ్లలో జరిగిన నష్టం ఇదీ

గడచిన 50 ఏళ్లలో ఉప్పాడ, అమీనాబాద్, కొమరగిరి, నేమాం, సుబ్బంపేట గ్రామాల్లో అధికారిక లెక్కల ప్రకారం సుమారు 2.5 కిలోమీటర్ల మేర తీరం ముందుకు చొచ్చుకు వచ్చింది. 50 ఎకరాల వ్యవసాయ భూములు, 400 ఎకరాల వ్యవసాయేతర భూములు కనుమరుగయ్యాయి. 1000 ఇళ్లు సముద్రంలో కలిసిపోయాయి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడల్లా సామాన్యులకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వం కంటి తుడుపు చర్యలు తప్ప శాశ్వత పరిష్కారానికి చొరవ చూపడం లేదనే మత్స్యకారుల విమర్శ.



ఉప్పాడ తీరం వెంబడి కోతకు గురైన ఇళ్లు

కేంద్రం నిధులు విడుదల చేస్తుందా..?

కాకినాడ తీర ప్రాంతాన్ని రాకాసి అలలు తీవ్ర నాశనం చేస్తున్నాయి. అనేక నివాస గృహాలు కనుమరుగు అవుతున్నాయి. కోత నివారణకు గతంలో జియోట్యూబ్ నిర్మించినా కొంతకాలానికి అదీ సముద్ర గర్భంలో కలిసిపోయింది. గ్రోయిన్సుతో కూడిన రక్షణ గోడ నిర్మాణమే శాశ్వత పరిష్కారమని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. ఉప్పాడ పరిసర గ్రామాల్లో రూ.323 కోట్లతో చేపట్టాల్సిన చర్యలపై సవివర నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గతంలోనే అందజేసింది. కోత నివారణకు ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కూడా తాజాగా ఈ ప్రతిపాదనలను కేంద్రం ముందుంచారు.

ప్రతిపాదనలు పంపిన ప్రాజెక్టుల్లో 90 శాతం కేంద్రం నిధులు, 10 శాతం రాష్ట్రం వాటా ఇవ్వాల్సి ఉంది. నేమాం నుంచి కొమరగిరి, ఉప్పాడ మీదుగా అమీనాబాద్ వరకూ 20 గ్రోయిన్సను నిర్మిస్తారు. [illegible] ఉపయోగించి సముద్రపు నీటిని మళ్లించేలా తీరం వెంబడి ఒక రక్షణ గోడను ఏర్పాటు చేస్తారు. నాణ్యత గల పెద్ద పెద్ద సిమెంట్ దిమ్మలను ఏర్పాటు చేయడమే కాక మడ అడవుల విస్తీర్ణాన్ని పెంచుతారు. దీంతో తీర ప్రాంత రక్షణతో పాటు మత్స్యకార గ్రామాలను సంరక్షించేందుకు అవకాశం ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ, జాతీయ తీర పరిశోధనా సంస్థలు ప్రతిపాదనలను సిద్ధం చేసాయి. దీనికి ప్రాథమిక దశలో రూ.323 కోట్లు అవసరం అవుతాయి. ఈ ప్రాజెక్టు పూర్తి కావాలంటే పూర్తిగా కేంద్రం ఇచ్చే నిధులు పైనే ఆధారపడి ఉంది. గత వైసిపి ప్రభుత్వ హయాంలోనే తీర రక్షణ కోసం పలుమార్లు మాజీ ఎంపి వంగా గీత కేంద్రాన్ని నిధులు కోరారు. అనేకసార్లు మంత్రులను కలిసి వినతిపత్రం అందజేశారు. కానీ ఏనాడూ కేంద్ర ప్రభుత్వం స్పందించిన పాపాన పోలేదు. ఈ జిల్లాలో సెజ్‌లో పెట్రో కెమికల్ కారిడార్ ఏర్పాటు చేస్తామన్న కేంద్రం అనేక ఏళ్లుగా ఊరిస్తూనే ఉంది. ఇంకా అనేక ప్రాజెక్టులపై నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో తీర రక్షణ కోసం కేంద్రం ఎంతవరకు స్పందిస్తుంది.. నిధులు విడుదల చేస్తుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది.



ఉప్పాడ తీరంలో సముద్రంలో కలిసిపోయిన ఇళ్లు

ఉప్పాడ తీర ప్రాంతంలో కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

అలల తాకిడికి ధ్వంసమైన బీచ్ రోడ్డును కలెక్టర్ షాన్‌మోహన్ షగిలి శుక్రవారం పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, మత్స్యశాఖ అధికారులతో కలసి పరిశీలించారు. ఎగసిపడుతున్న అలలు, మరోపక్క సుబ్బంపేట వద్ద బీచ్ రోడ్డు ధ్వంసం కావడంతో రాకపోకలను నిలిపివేశారు. దీంతో జిల్లా కలెక్టర్ తీర ప్రాంతాన్ని ఉన్నతాధికారులతో పరిశీలించారు. సముద్ర నీరు రావడంతో రంగంపేట వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి సముద్రపు నీరు నిల్వ ఉండిపోయింది. దీంతో ప్రత్యేక మోటార్లను ఏర్పాటు చేసి నిల్వ ఉన్న సముద్రపు నీటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. మత్స్యకారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తీర ప్రాంత సమస్యలను సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు వివరిస్తానని తెలిపారు. ఎంఎల్‌సి పద్మశ్రీ, డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, గంట విజయ్ కుమార్, టిడిపి నాయకులు కలెక్టర్ వెంట ఉన్నారు ఉప్పాడ కాకినాడ బీచ్ రోడ్డు ధ్వంసం కావడంతో మరమ్మతులు చేపట్టే వరకు తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు కొత్తపల్లి ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

ప్రజాశక్తి-కాకినాడ

2025-26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్రంలో రైతుల నుండి 50 లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు లక్ష్యం చేపట్టామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ హాల్లో మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, విసి ఎండి మనజీర్ జిలాని సమూన్లతో కలిసి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని కాకినాడ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల జాయింట్ కలెక్టర్లు, సివిల్ సప్లయిస్ కార్పోరేషన్ డిఎంలు, డిఎస్ఒలు, వ్యవసాయ, రెవెన్యూ, సహకార, మార్కెటింగ్, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. 2025-26 ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రణాళికపై చర్చించి లక్ష్యాలను నిర్దేశించారు.

ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ గత యేడాది ఖరీఫ్ సీజను సేకరణలో తీసుకున్న మంచి ప్రణాళికలు చేపట్టామని రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్నికి 48 గంటలలోపే చెల్లింపులు చేపట్టామని చెప్పారు. గత ప్రభుత్వం రైతులకు బకాయి పెట్టిన రూ.1,674 కోట్ల మొత్తాన్ని కూడా కూటమి ప్రభుత్వం రైతులకు చెల్లించిందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ పంటలు ముందే అక్టోబరు రెండవ వారానికే కోతకు వస్తున్నందున అన్ని జిల్లాలో ధాన్యం మార్కెట్‌కు వచ్చేందుకు నాలుగైదు రోజుల ముందే సేకరణ కేంద్రాలను ప్రారంభించాలని, ఇందుకు సిబ్బందికి అవసరమైన పిపిసి కేంద్రాల సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలను సెప్టెంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. ఉమ్మడి గోదావరి జిల్లాలోని 1234 రైతు సేవా కేంద్రాలను, 691 రైసు మిల్లులను అనుసంధానం చేసి సేకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సమాయత్తం కావాలన్నారు. ఈ సమావేశంలో కాకినాడ జిల్లా జెసి రాహుల్ మీనా, అంబేద్కర్ కోనసీమ జిల్లా జెసి టి.నిశాంతి, పశ్చిమ గోదావరి జిల్లా జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

89 మంది కార్మికుల అక్రమ తొలగింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం-జి.రాగంపేట రహదారిలోని బ్లూ ఓషన్ బయోటిక్ ప్రైవేట్ కంపెనీ శుక్రవారం ఫ్యాక్టరీలో పని చేసే 89 మంది కార్మికులను అక్రమంగా విధుల నుంచి తొలగించింది. దీంతో కార్మికులందరూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఫ్యాక్టరీ గేటు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ 12 ఏళ్లుగా తాము ఫ్యాక్టరీలో విధులు నిర్వహిస్తున్నామన్నారు. తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విధుల్లోంచి తొలగించటం అన్యాయం అన్నారు. వెంటనే తమను విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విధుల్లోకి తీసుకోకపోతే తొలగించబడిన కార్మికులందరూ కార్మిక సంఘాల మద్దతుతో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కంఠంరెడ్డి దుర్గాప్రసాద్, కె.రాజేష్, కె.సత్యనారాయణ, జి.వీరబాబు, ఎ.త్రిమూర్తులు, వి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్ డిమాండ్ చేశారు. కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందస్తు నోటీసు లేకుండా కార్మికులను తొలగించటం అన్యాయం అన్నారు. ఈ చర్య కార్మిక కుటుంబాల పొట్ట కొట్టడమే అన్నారు. తొలగించిన కార్మికులందరికీ న్యాయం జరిగే వరకు సిఐటియు అండగా ఉంటుందన్నారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయంలో ఎవినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నీలపాల సూరిబాబు, సిరపరపు శ్రీనివాస్, కార్మికులు కె.సత్యనారాయణ, కె.దుర్గాప్రసాద్, లోకేష్, త్రినాధ్, సాయికుమార్, రాజేష్ పాల్గొన్నారు.



ఫ్యాక్టరీ గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

16 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుక నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఒక బాలికను ఒక యువకుడు ప్రేమ పేరుతో నమ్మించి అత్యాచారం చేశారన్నారు. వారిని పోలీసులు అరెస్ట్ చేసి శిక్షించాలన్నారు. లేని పక్షంలో బాలిక కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు.

16న కౌలు రైతుల మహాసభ

ప్రజాశక్తి -కరప


ఎపి కౌలు రైతుల సంఘం మండల మహాసభ ఈ నెల 16న నిర్వహిస్తున్నట్టు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్ ఒక ప్రకనలో తెలిపారు. కరప భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని అరట్లకట్ల, కొరిపల్లి, కరప, వాకాడ, వేములవాడలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. యడ్ల కృష్ణ, చందాల శ్రీను, గుత్తుల రమణ, ధనరాజు పాల్గొన్నారు.

కరప ఎంపిడిఒగా రామ్‌గోపాల్

ప్రజాశక్తి -కరప

కరప నూతన ఎంపిడిఒగా ఎం.రాంగోపాల్ నియమితులయ్యారు. ఆయన గతంలో ఇదే కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేశారు. ఈ నెల 16న బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. నూతన ఎంపిడిఒను ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ నరసింహారావు అభినందించారు.

కార్టూన్ 'నిజం'



చేసింది చెప్పుకోవాలి

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ప్లాస్టిక్ సంచుల వినియోగంతో పర్యావరణానికి తీవ్ర ముప్పుతో పాటు ప్రజలు అనారోగ్యం బారిన పడతారని విశ్రాంత ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల శూన్య దినోత్సవ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం వస్త్ర సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రవిశంకర్ పట్నాయక్, రాజా, సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.

బొత్సను కలిసిన ముద్రగడ గిరిబాబు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణను విజయవాడలో ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు కలిశారు. నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై చర్చించారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేలా కష్టపడి పని చేయాలని బొత్స సూచించారు. త్వరలోనే బూత్ కమిటీలను, గ్రామ కమిటీలను పూర్తిచేసి పార్టీని బలోపేతం చేయనున్నట్టు గిరిబాబు ఆయనకు తెలిపారు.

ఎంఎల్ఎ నెహ్రూను కలిసిన ఎంపిడిఒ

ప్రజాశక్తి-గండేపల్లి

బదిలీపై వచ్చిన ఎంపిడిఒ కర్రి హరికష్ణ సత్యారెడ్డి శుక్రవారం బాధ్యత స్వీకరించారు. ఆయనను మండల పరిషత్ సిబ్బంది ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూను ఎంపిడిఒ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఎఒ కర్రి చంద్రరావు, ఇఒపిఆర్‌డి ఐఎన్.శ్రీనివాస్, జెడ్ రాగంపేట సెక్రెటరీ తరంగిణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొండలరావు

14న హమాలీల మహాసభ

ప్రజాశక్తి - సామర్లకోట

ఈ నెల 14న సామర్లకోటలో నిర్వహించే ఎపి బేవరేజ్ హమాలీస్ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి విప్పర్తి కొండలరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక యూనియన్ జనరల్ బాడీ సమావేశం అధ్యక్షుడు వి.అప్పలరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కొండలరావు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభ నీలమ్మ చెరువు గట్టు దగ్గర గల లయన్స్ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మహాసభకు రాష్ట్రవ్యాప్తంగా 18 డిపోల నుండి ప్రతినిధులు హాజరవుతారన్నారు. గత 4వ మహాసభలో కార్యక్రమాలు, సాధించిన విజయాలు సమీక్షించి భవిష్యత్తు కర్తవ్యాలు మీద చర్చ జరుగుతుందన్నారు. ఈ మహాసభలను కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కార్యదర్శి ఎ.సోమేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బి.ఆదినారాయణ, రామారావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

సిపిఎం అగ్ర నేత సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పలుచోట్ల ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ప్రజాస్వామ్య హక్కుల పోరాటంలో ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపు ఇచ్చారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ కాకినాడ సుందరయ్య భవన్‌లో కె.వీరబాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో భారత రాజ్యాంగం మౌలిక విలువలపై మోడీ ప్రభుత్వం దాడి చేస్తోందని, మతాన్ని రాజకీయాలకు వాడుకుంటూ ప్రజల మధ్య చీలికలు తీసుకువస్తోందని విమర్శించారు. లౌకిక, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కొనసాగించడమే సీతారాం ఏచూరికి ఘనమైన నివాళి అన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కెఎస్.శ్రీనివాస్, ఎం.రాజశేఖర్, పలివెల వీరబాబు, సిహెచ్.రమణి, జి.బేబీరాణి, మేడిశెట్టి రమణ, మలకా రమణ, ఎన్.సూర్యనారాయణ, ఎంజి.సూరిబాబు, భూలక్ష్మి, చంద్రవతి, సురేష్, శ్రీహరి, యు.సత్యనారాయణ రెడ్డి, కె.సత్తిబాబు పాల్గొన్నారు.



యు.కొత్తపల్లిలో..



కాకినాడ రూరల్‌లో..

కాకినాడ రూరల్ వలసపాకల సుందరయ్య కాలనీలో కార్మికులు ఏచూరికి ఘనంగా నివాళులర్పించారు. సిపిఎం నాయకులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, అజయ్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంతాడి రాంబాబు, బొడ్డు అప్పలరాజు, బొడ్డు చంద్రశేఖర్, సింహాద్రి, రాంబాబు, సంగీతరావు, అజయ్ కుమార్ పాల్గొన్నారు. తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీలో చిట్టిమేను సాయిబాబా, కక్కల సత్యనారాయణ, చింతపల్లి అజయ్ కుమార్, జోగా అప్పారావు, చిట్టిమేను గంగాభవాని, పోలవరపు మంగ, చిట్టిమేను ప్రసాద్, మనసా శంకరమ్మ, కాకి వెంకటలక్ష్మి, ఇల్లా దుర్గ, బొందల లక్ష్మి సీతారామ్‌కు నివాళులర్పించారు.

పెద్దాపురం యాసలపు సూర్యారావు భవనంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు నీలపాల సూరిబాబు మాట్లాడారు. సిపిఎం నాయకులు చల్లా విశ్వనాథం, డి.సత్యనారాయణ, డి.కష్ణ, కూనిరెడ్డి అప్పన్న, యాసలపు రమేష్, కూనిరెడ్డి నరసింహమూర్తి, రొంగల వీర్రాజు, సుబ్బలక్ష్మి, ఎం.నరసింహమూర్తి, లక్ష్మి, సూర్యనారాయణ, ఎం.భాస్కరరావు, గూనూరు రమణ, నీలం శ్రీను, వడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

కాజులూరు సిపిఎం జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు కాజులూరు సెంటర్‌లో ఏచూరికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కడలి రాంపండు, యాళ్ల నర్సింహమూర్తి, షేక్ మీరా, పిల్లి శ్రీను, కె.మేరీ, సఖిలే నాగేశ్వరావు, పద్మావతి పాల్గొన్నారు.

యు.కొత్తపల్లి ఎండపల్లిలో ఏచూరి చిత్రపటానికి సిపిఎం నాయకులు గుర్రాల అప్పారెడ్డి, చీకట్ల సాంబశివకుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు కాళ్ల నాగేశ్వరరావు, సూరిబాబు, గంగాధర చిన్ని, సోమరాజు, సుబ్రహ్మణ్యం, రామిరెడ్డి సుబ్బిరెడ్డి, వెల్లంకి సత్యనారాయణ పాల్గొన్నారు.

తాళ్లరేవు ప్రజా సంఘాల కార్యాలయంలో సిపిఎం మండల కన్వీనర్ టి.ఈశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎన్. త్రిమూర్తులు, నల్లి ఈశ్వరరావు, ఉంగరాల భూరిబాబు, అత్తిలి బాబూరావు, దడాల అబ్బులు, చిన్నయ్య, నాగేశ్వరరావు, విగ్నేశ్వర రావు, సత్యనారాయణ నివాళులర్పించారు. నీలపల్లిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కెఎస్.శ్రీనివాస్, ఎం.రాజశేఖర్, పి.అశోక్ కుమార్ నివాళి అర్పించారు.



కాకినాడ సుందరయ్య భవన్‌లో ఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు



పెద్దాపురంలో ఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు



కాజులూరులో..

వికలాంగ పాఠశాలను సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి- సామర్లకోట

సామర్లకోటలోని సిరి వికలాంగ పాఠశాల, వసతి గృహాలను శుక్రవారం కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. తొలుత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు, పేపర్ ప్లేట్ మేకింగ్ యూనిట్, క్లాత్ మేకింగ్ యూనిట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు ఉత్సాహంగా సమాధానం ఇచ్చిన పలువురు విద్యార్థులను ఆయన అభినందించారు. తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ డి.గోపిదేవిని కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న పేపర్ ప్లేట్ యూనిట్, క్లాత్ మేకింగ్ యూనిట్లను కూడా కలెక్టర్ పరిశీలించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

కాకినాడ జిల్లాకు నాయకర్ పేరు పెట్టాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

కాకినాడ జిల్లాకు విద్యాదాత మల్లాడి సత్యలింగ నాయకర్ పేరు పెట్టాలని శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అంబేద్కర్ భవనంలో మాజీ ఎంపిపి మందాల గంగ సూర్యనారాయణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎంపిపి రాయుడు సునీత, జెడ్‌పిటిసి దొమ్మేటి సాగర్, ఎఎంసి మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, బొడ్డు సత్యనారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు, మాట్లాడారు. కుల, మత ప్రాంతాలకు అతీతంగా అందరికీ విద్యను అందించిన మహాదాత మల్లాడి సత్యలింగ నాయకర్‌కు గుర్తింపుగా ఆయన పేరు పెట్టాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. రాయుడు గంగాధర్, టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజు బాబు, ఉంగరాల వెంకటేశ్వరరావు, వైదాడి నూకరాజు, అత్తిలి బాబూరావు, కంచర్ల రామోజీ, సామా భగవాన్, కన్నీడి వెంకటరమణ, జక్కల ప్రసాద్, పోతుల రత్నకుమారి, పొన్నమండ రామలక్ష్మి, బర్రే లక్ష్మీనరసింహరాజు, వాసంశెట్టి శ్రీనివాస్, పట్టా ఆదినారాయణ వర్మ, యనమండ్ర విజయ్ కుమార్, చెక్కా అజయ్, వెంటపల్లి నూకరాజు, ముద్దన వెంకట శివరామ ప్రసాద్, విత్తనాల కరిమల స్వామి, వాడ్రేవు వీరబాబు, స్వామి నాయకర్ పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొవ్వూరు

గామన్ బ్రిడ్జిపై ఈనెల 7న సంభవించిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వృద్ధుడు గురువారం రాత్రి మతి చెందినట్లు పట్టణ సిఐ పి.విశ్వం తెలిపారు. ఏడో తేదీ ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. తీవ్ర గాయాల పాలైన ఆతన్ని హైవే పోలీసులు కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతి చెందాడని సిఐ తెలిపారు. మృతునికి సంబంధించిన ఎలాంటి ఆచూకీ దొరకలేదన్నారు. మృతుని వయస్సు 60 నుంచి 65 ఏళ్లు ఉంటుందన్నారు వివరాలు తెలిసినవారు 9440796622 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

బాలికను మోసగించిన యువకునిపై కేసు

ప్రజాశక్తి -కొవ్వూరు

పట్టణానికి చెందిన 15 ఏళ్ల బాలికను ప్రేమపేరుతో నమ్మించి వంచించిన దాసరి వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేశామని సిఐ పి.విశ్వం తెలిపారు. యువతి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు. వివాహం చేసుకోమని అడిగితే తమను కులం పేరుతో ధూషించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు నిందితునిపై పోక్సో కేసుతో పాటూ అట్రాసిటీ కేసు నమోదు చేశామని సిఐ తెలిపారు.

బంగారు ఆభరణాల చోరీ

ప్రజాశక్తి-గండేపల్లి

మండలం తాళ్లూరులో జాతీయ రహదారిపై హనీ దాబా వద్ద ఈ నెల 10న సుమారు 600 గ్రాముల బంగారు వస్తువులు చోరీకి గురైనట్టు గండేపల్లి ఎస్ఐ శివనాగు తెలిపారు. నెల్లూరుకు చెందిన అంబూరి మునిరాజు నెల్లూరు గోల్డ్ జువెలరీ షాపులో పని చేస్తున్నారు. ఆయన తరచూ విజయనగరం, విశాఖపట్నంలో గోల్డ్ షాపులకు బంగారు వస్తువులు పట్టుకొని వెళుతుంటారు. రెండు రోజుల క్రితం నెల్లూరు నుంచి 1200 గ్రాముల బంగారు వస్తువులు పట్టుకొని వచ్చి విజయనగరం వైజాగ్‌లో 600 గ్రాముల గోల్డ్ వస్తువులు షాపులకు ఇచ్చారు. మిగిలిన 600 గ్రాముల గోల్డ్ వస్తువులతో 10న నెల్లూరు వస్తుండగా తాళ్లూరు హనీ దాబా వద్దకు భోజనం నిమిత్తం ఆగారు. అనంతరం తిరిగి చూసుకునేసరికి బ్యాగ్‌లో బంగారు ఆభరణాలు పోయినట్టు గుర్తించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేకాట శిబిరాలపై దాడి

ప్రజాశక్తి-గండేపల్లి, జగ్గంపేట

గండేపల్లి, జగ్గంపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో వివిధ చోట్ల పేకాట శిబిరాలపై శుక్రవారం గండేపల్లి, జగ్గంపేట ఎస్ఐలు సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాడుతున్న 34 మందిని అరెస్టు చేసిన పెద్దాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రవేశపెట్టినట్టు సిఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు.

కుమారుడు సహా తల్లి అదృశ్యం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలో మూడేళ్ల కుమారునితో కలిసి తల్లి అదృశ్యమైన సంఘటన దుర్గాడలో చోటు చేసకుంది. గ్రామానికి చెందిన నక్కా సింహాచలం మూడేళ్ల కుమారుడు నక్కా చైతన్యతో కలిసి ఎవరికీ చెప్పకుండా బుధవారం 10 గంటల సమయంలో ఇంటి నుండి బయటకి వెళ్లి తిరిగి రాలేదు. వారి కోసం బంధువుల ఇళ్లు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో సింహాచలం మేనమామ శివకోటి నూకరాజు ఫిర్యాదుతో గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

టిడిపిలో ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యుల చేరిక

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక సంజీవి ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ సంఘం సభ్యులు కడితి లాజర్ ఆధ్వర్యంలో పలువురు శుక్రవారం టిడిపిలో చేరారు. శుక్రవారం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో సంఘం సభ్యులకు ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ అందరి అభివృద్ధికి కావాల్సిన అన్ని రకాల సంక్షేమ కార్యక్రమాలు అందించడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. సంఘ అభివద్ధికి ఆదరణ పథకం ద్వారా ఆదుకుంటానన్నారు. కొత్త కొండబాబు, బుర్రి సత్తిబాబు, నండ్ల చిరంజీవి, ఎస్‌విఎస్.అప్పలరాజు, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, పీలా మహేష్, రాయి సాయి, మారిశెట్టి రాధా, వేములకొండ జోగారావు, సాంబత్తుల చంద్రశేఖర్, తుమ్మల కిషోర్, గెద్దాడ సత్యవేణి, కోండ్రోతు శ్రీను పాల్గొన్నారు.

ధర్మవరంలో గిరిబాబు పర్యటన

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ధర్మవరంలో వైసిపి కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు శుక్రవారం పర్యటించారు. పార్టీ నాయకులును, కార్యకర్తలను కలిశారు. గ్రామానికి చెందిన కడారి వీరబాబు ఇటీవల కాలంలో అనారోగ్యం బారిన పడడంతో ఆయనను గిరిబాబు పరామర్శించారు. రైతులకు సరిపడినంత యూరియా లేదనిర, యూరియా సరఫరా చేస్తున్నమని ప్రచారం చేసుకుని రైతులను మోసం చేస్తున్నారని గిరిబాబు ధ్వజమెత్తారు. రైతుల సంక్షేమం కోసం వైసిపి కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి నాని, జువ్వల బాబులు, బొల్లు చిట్టిబాబు, మచ్చకర్ల దాసు, రాపా గుర్రాజు, సానా తాతీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు కడితే రూ.5 వేల జరిమానా

ప్రజాశక్తి - మండపేట

పట్టణంలో విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు కడితే రూ.5వేల జరిమానా విధిస్తామని మండపేట మున్సిపల్ కమిషనర్ టివి.రంగారావు అన్నారు. మండపేటలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లా డుతూ విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు కట్టడం కారణంగా విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేసేటప్పుడు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఫ్లెక్సీలు ఎవరు కట్టినా, ఫ్లెక్సీలో ఉన్న వారిపైనా, వాటిని కట్టిన సిబ్బందిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కాకినాడ


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు పరిష్కరించాలని ఎపి కౌలు రైతుల సంఘం నాయకులు మంత్రి మనోహర్‌ను కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మంత్రిని సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు తిరుమల శెట్టి నాగేశ్వరరావు, సంఘం పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు కలిసి వినతిపత్రాలు అందజేశారు. ధాన్యం కొనుగోలు అంశంపై ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల సమావేశంలో మంత్రి దష్టికి పలు సమస్యలు తీసుకుచ్చారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో గత ఖరీఫ్‌లో లక్షా 80 వేల ఎకరాలలో వరి పంట సాగు చేయగా ఐదు లక్షల 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా వేశారని, 3 లక్షల 40 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయనున్నట్లు లక్ష్యంగా ప్రకటించారని తెలిపారు. రైతులు పండించిన పంటలో 60 శాతం మాత్రమే కొనుగోలు లక్ష్యంగా ప్రకటించడం వల్ల మిగిలిన పంటను దళారులకు, వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రైతు సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షుడు తిరుమలశెట్టి నాగేశ్వరావు మాట్లాడుతూ ధాన్యం పండించడానికి రైతుకు ఉత్పత్తి ఖర్చు విపరీతంగా పెరిగిపోవడంతో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతుకు గిట్టుబాటు కావడం లేదన్నారు.



రాస్తారోకో చేస్తున్న సిపిఎం, వామపక్షాల, ఆదివాసీ సంఘాల నాయకులు

రోడ్డు పునఃనిర్మాణం కోరుతూ రాస్తారోకో

ప్రజాశక్తి-ఏలేశ్వరం

దశాబ్ద కాలం పైబడి శిథిలావస్థకు చేరుకున్న రమణయ్యపేట-జె.అన్నవరం ఆర్ అండ్ బి రహదారి పునర్నిర్మాణం కోరుతూ సిపిఎం అనుబంధ సంఘాలు శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. అడ్డతీగల మండలం గుంటువానిపాలెం ఆర్ అండ్ బి రహదారిపై వర్షాన్ని సైతం లెక్కచేయక పెద్ద ఎత్తున గిరిజనులు12 గంటల పాటు రాస్తారోకో, వంటావార్పు, కోలాటం నిర్వహించటంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో రహదారులు నిర్మిస్తున్నామని డప్పు కొట్టుకునే కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతాలకు వెళ్లే రమణయ్యపేట-జె.అన్నవరం ప్రధాన రహదారిని ఎందుకు పునర్నిర్మించటం లేదని ప్రశ్నించారు. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే గిరిజన ప్రజలు బెంబేలెత్తుతున్నారని అన్నారు. 20 నిమిషాల్లో ప్రయాణించవలసిన 12 కిలోమీటర్లు రోడ్డుపై వెళ్లాలంటే గంట సమయం పడుతోందన్నారు. అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. వైద్యం నిమిత్తం తరలించే అంబులెన్సులు సైతం మరమ్మత్తులకు గురై గిరిజనులు అంబులెన్స్‌లోనే ప్రసవించడం, ప్రాణాలు పోగొట్టుకోవడం వంటివి చోటు చేసుకుంటున్నట్టు తెలిపారు. రాజవొమ్మంగి, అడ్డతీగల, వై.రామవరం మండలాల గిరిజనులు చేపట్టిన ఆందోళనకు మైదాన ప్రాంత గ్రామాలైన రమణయ్యపేట, తూర్పులక్ష్మీపురం, మర్రివీడు, జె.అన్నవరం గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. రంపచోడవరం డిఎస్‌పి ప్రశాంత్, సిఐ నరసింహమూర్తి, అడ్డతీగల దుచ్చర్తి, గంగవరం ఎస్ఐలు ఆందోళనకారులతో చర్చించారు. ఐటిడిఎ పిఒ స్మరణ్ రాజ్ ఫోన్‌లో ఆందోళనకారులతో మాట్లాడారు. వెంటనే పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జెఎసి నాయకులు పుట్టా రామరాజు, వంతు బాలకష్ణ, ఎస్.లచ్చారావు, సోమిశెట్టి బుచ్చిరాజు, కాకవాడ వీరభద్రం, రాజవొమ్మంగి ఎంపిపి గోను వెంకటలక్ష్మి, తంటికొండ, కిమ్మూరు సర్పంచులు ఎ.సుబ్బలక్ష్మి, ప్రసాద్ పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రత్యేక కృషి


ప్రజాశక్తి-ఏలేశ్వరం


చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ, కలెక్టర్

రాష్ట్రంలో మత్స్యకారుల అభివద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ప్రత్తిపాడు ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. ఈ మేరకు ఆమె శుక్రవారం కలెక్టర్ షాన్ మోహన్ సగిలితో కలిసి ఏలేరు రిజర్వాయర్‌లో మేలు జాతి చేపపిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏలూరు రిజర్వాయర్‌లో చేపలు పట్టుకుని వేలాది మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. వారి జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు త్వరగా పెరిగే మేలు జాతి చేప పిల్లలను విడుదల చేయడం ద్వారా మత్స్య సంపద మరింత పెరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న ఆధునిక పథకాలు, చేపల వేటలో మెలకువలపై శిక్షణ, సబ్సిడీపై రుణాలు, వినియోగించుకోవాలని కోరారు. మత్స్యకారులు విధిగా మత్స్య సహకార సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వ గుర్తింపు పొంది ప్రభుత్వ రాయతీలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏలేరు రిజర్వాయర్ చైర్మన్ బస్వా వీరబాబు, సభ్యులు ఎస్‌జివి.సుబ్బరాజు, కూటమి నాయకులు పెంటకోట మోహన్, జ్యోతుల పెదబాబు, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, చిక్కాల లక్ష్మణరావు, పలివెల శ్రీను, మత్స్య శాఖ జెడి కృష్ణారావు, ఎడి లావణ్య, రాయి నూకరాజు, రామకృష్ణ ఉన్నారు.

నిండుకుండలా ఏలేరు జలాశయం

ప్రజాశక్తి-ఏలేశ్వరం


నిండుకుండలా ఉన్న ఏలేరు జలాశయం

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఏలేరు రిజర్వాయర్ పెద్ద ఎత్తున నీటితో నిండుకుండలా మారింది. రిజర్వాయర్ సామర్థ్యం 86.56 మీటర్లకు గాను ప్రస్తుతం రిజర్వాయర్లో 82.00 మీటర్ల నీటి నిల్వలు ఉన్నాయి. ఏలేరు పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు 3500 క్యూసెక్కుల వరద నీరు, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి 1400 క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు డిసిఆర్ స్లూయిజ్ ద్వారా 600 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 600 క్యూసెక్కులు నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు వైఎల్ఎంసి కాలువ ద్వారా 175 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో రిజర్వాయర్ నుంచి 1,375 క్యూసెక్కుల నీరు బయటకు వెళుతోంది. క్రమంగా ఏలేరు రిజర్వాయర్ నీటిమట్టం పెరుగుతుండడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. దిగువ ప్రాంతాలైన కిర్లంపూడి, జగ్గంపేట, గొల్లప్రోలు, పిఠాపురం, కాకినాడ రూరల్ మండలాల్లో ఏటిగట్లు బలహీనంగా ఉండడంతో ఆ మండలాల రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.


హెచ్‌ఎం వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం ప్రధానోపాధ్యాయులు పొడగట్లపల్లి వెంకటేశ్వరరావు ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆయనకు శుక్రవారం ఘన సత్కారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా, మండల విద్యాశాఖ అధికారి అలజంగి నాగరాజు అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పి.రాంబాబు, జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. సభలో వక్తలు మాట్లాడుతూ ఒత్తిడి రహిత విద్యావిధానం ద్వారానే విద్యార్థులలో సృజనాత్మకత, జ్ఞాన వికాసం సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగా కృషి చేసి ఉత్తమ ఫలితాలను సాధించిన వెంకటేశ్వరరావు కృషి అభినందనీయమని కొనియాడారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధి, పాఠశాల యొక్క సర్వతోముఖాభివృద్ధి కోసం తన సేవలను అంకితభావంతో సమర్పించిన ఆయన దక్పథం ఉపాధ్యాయులకు ఆదర్శమన్నారు. విద్యా రంగం అభివృద్ధిలో ప్రతి ఒక్కరి సహకారం ఉందని తెలిపారు.

డోర్ టు డోర్ సర్వేపై వ్యతిరేకత

ప్రజాశక్తి - మామిడికుదురు

డోర్ టు డోర్ సర్వేకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఐక్యవేదిక పూర్తిగా వ్యతిరేకిస్తుందని సభ్యులు అన్నారు. సమయపాలన లేని వీడియో కాన్ఫరెన్స్‌ల నుంచి విముక్తి కలిగించాలని, నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, గ్రామ వార్డు సచివాలయ ఉద్యో గులను జూనియర్ అసిస్టెంట్ కేడర్‌కు మార్చాలని, ఎంపిడిఒ భవానికి సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక సభ్యులు అందజేశారు.

ముక్తేశ్వరంలో మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - అయినవిల్లి

ముక్తేశ్వరం జడ్‌పి ఉన్నత పాఠశాలలో మండలంలోని ఉన్నత, ప్రాథమి కోన్నత పాఠశాలల విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిక్రీడా పోటీలు ఈ నెల 17 నుంచి నిర్వహిస్తారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మకాయల గణేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పలువురికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

కొత్తూరులో గల టిడ్కో గృహ సముదాయంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మారెళ్ళ మహేం ద్ర నాయుడు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఎల్‌వి.ప్రసాద్ ఉచిత కంటి వైద్యలు దీనిని ఏర్పాటు చేశారు. డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ కొండలరావు గ్రామ ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. కొంతమంది రోగులను అధిక స్థాయి వైద్య సేవల కోసం ఎల్. ప్రసాద్ ఆసు పత్రికి రిఫర్ చేశారు.

సుంకరపాలెం వివాదాస్పద స్థలంపై సర్వే

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలం సుంకరపాలెం పంచాయతీ సర్వే నెంబర్ 123, 125లో డ్రైనేజీ చెంతన ఉన్న స్థలం వివాదంపై రెవెన్యూ, పంచాయతీ అధికారులు శుక్రవారం సర్వే నిర్వహించారు. డ్రైనేజీ చెంతన నివాసాలతోపాటు, ఖాళీగా ఉన్న స్థలాలకు సరిహద్దులు కేటాయించారు. ఈ సర్వేలో మండల సర్వేయర్ నిరంజన్, సచివాలయ సర్వేయర్ జి.ప్రసాద్, సుంకరపాలెం పంచాయతీ కార్యదర్శి వల్లి బాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజానికి వెన్నెముక

ప్రజాశకి-కాజులూరు

ఉపాధ్యాయులే సమాజానికి వెన్నెముకగా నిలుస్తారని తహశీల్దారు రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. శుక్రవారంఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సత్కరించారు. నక్కా వెంకటలక్ష్మి, పేరి ఉమాకాంత్, ప్రభాకర్, కె.కృష్ణ, సిహెచ్.కనకదుర్గ, జి.శ్రీనివాస్, పి.సత్యనారాయణను సత్కరించారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు వి.భానుప్రకాష్, శివ ప్రసాద్, రవీంద్ర, రామకృష్ణ, ఎంఇఒలు డేవిడ్, జాన్, ఎంపిడిఒ రాంబాబు పాల్గొన్నారు.
ఉపాధ్యాయుని సన్మానిస్తున్న దశ్యం

పోతుల మోహనరావుకు ఘన సత్కారం

ప్రజాశక్తి-గండేపల్లి

కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పోతుల మోహనరావును శుక్రవారం పలువురు ఘనంగా సత్కరించారు. మెమొంటో అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కంటిపూడి సత్యనారాయణ, బొల్లంరెడ్డి రామకృష్ణ, పార్టీ నాయకుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దేవస్థానం భూమి స్వాధీనం

ప్రజాశక్తి-కాజులూరు

మండలంలోని ఆర్యవటంలోని శ్రీసీతారామస్వామి దేవస్థానానికి చెందిన భూమిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా దేవాదాయ శాఖ అధికారి కనపర్తి నాగేశ్వరావు తెలిపారు. అర్చక సర్వీస్ నిమిత్తం ఆర్యవటంలో 4-09 ఎకరాల భూమిపై హైకోర్టు ఉత్తర్వుల మేరకు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ పివి.టిశివ కుమార్, వి.ఫణీంద్ర కుమార్, ఇఒలు కొప్పుల వేణుగోపాలరావు, ఎంఎం.వీరభద్రరావు, జి.శివబాబు, బివిఆర్.చౌదరి, డి.శ్రీనివాసరావు, కె.సోమరాజు, పి.కృష్ణారెడ్డి, కెటి.రవితేజ, ఎ.బాలకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-రౌతులపూడి

జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఐదుగురికి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభించిందని కోచ్ లక్ష్మణరావు తెలిపారు. ఇటీవల రాజమహేంద్రవరంలో 19 స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీల్లో పిఠాపురానికి చెందిన విద్యార్థులతో పాటు రౌతులపూడి సెయింట్ థామస్ పాఠశాల విద్యార్థి సుర్ల దుర్గా నాగేంద్ర ప్రతిభ కనబరిచాడు. నాగేంద్రను పాఠశాల కరస్పాండెంట్ సుకుమార్ పాఠశాల సిబ్బంది అభినందించారు.


కమిషనర్ శ్రీకాంత్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

సమస్యలపై కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు సిరపరపు శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో కుక్కల బెడద తీవ్రంగా ఉందన్నారు. అనేక వీధులలో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయని వీధులలో నడవడానికి ప్రజలు భయపడుతున్నారన్నారు. ఇటీవల కాలంలో కుక్క కాట్లకు అనేకమంది గురయ్యారన్నారు. 14, 15 వార్డుల్లో రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయన్నారు. రైతు బజార్ ఎదురుగా చెత్తగుట్టలతో డంపింగ్ యార్డ్ లాగా తయారయిందన్నారు. శ్మశానాలలో తుప్పలు, డొంకలు విపరీతంగా పెరిగి పోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కూనిరెడ్డి అప్పన్న, యాసలపు రమేష్, దారపురెడ్డి కృష్ణ, నెక్కల నరసింహమూర్తి, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

విజయవంతంగా సూపర్ సిక్స్ పథకాల అమలు

ప్రజాశక్తి - పెద్దాపురం

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేశారని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శుక్రవారం స్థానిక వత్సవాయి భవనంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు అధ్యక్షతన సూపర్ సిక్స్ విజయోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రంధి సత్యనారాయణ, తూతిక రాజు, కోరుపూరి రాజు, పెదకాపు, టిడిపి మండల అధ్యక్షుడు మొయిళ్ల కృష్ణమూర్తి, నూనె రామారావు, రేలంగి వెంకటరావు, జల్దాని సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

యానాం వార్తలు

పుదుచ్చేరి స్కూలుకు రీజెన్సీ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశానికి రీజెన్సీ విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం టివిఎస్.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. పుదుచ్చేరి స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ నిర్వహించిన సెలక్షన్ ట్రయల్స్‌లో రీజెన్సీ పబ్లిక్ హైస్కూల్ నుంచి క్రికెట్ విభాగంలో కాలేపల్లి కృష్ణ మనోహర్, ఓలేటి నిఖిల్ తేజ, అథ్లెటిక్స్ విభాగంలో నందికి సాత్విక్ ఎంపికయ్యారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు బోట్టా శ్రీనివాస్‌ను పలువరు అభినందించారు.

ప్రభుత్వ కళాశాలలో హిందీ దివస్

ప్రజాశక్తి - యానాం

కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ మైభారత్ ఆధ్వర్యంలో ఎస్‌టిపిపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ దివస్ కార్యక్రమం నిర్వహించారు. హిందీలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, తిర్రి గోపి, హిందీ ఉపాధ్యాయులు పద్మావతి, లీలాకుమారి పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న నాయకులు

గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డు నిర్మించాలి

ప్రజాశక్తి - కాజులూరు

గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డు వెంటనే నిర్మించాలని జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జెఎసి నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పదేళ్ల నుంచి రోడ్డు పాడైపోయి శిథిలావస్థకు చేరుకున్నా రోడ్డు నిర్మాణం చేపట్టలేదని, మెయిన్ రోడ్‌లో ఉన్న రెండు వంతెనలు పాడైపోయినా నిర్మాణాలు చేపట్టలేదన్నారు. పక్కన వేస్తున్న కరకట్ల వల్ల మురుగు దిగక పంట పొలాలన్నీ పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో లింకు రోడ్లు మొత్తం శిథిలావస్థకు చేరి పాడైపోయిన వెంటనే ఈ నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు గత జులై 27న ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేసినప్పుడు మంత్రి సుభాష్ పనులు చేస్తామని హామీ ఇచ్చినా నేటికీ నెల కావస్తున్నా రోడ్డు పనులు ప్రారంభించలేదన్నారు. దీనిపై ఈ నెల 17న దీనిపై కృష్ణుడు గుడి వద్ద వంటావార్పు, రాస్తారోకో చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు మాధవరపు నానాజీ, మాజీ జెడ్‌పిటిసి యాల సూర్యప్రకాష్, ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, కడలి రాంపండు, సలాది నానాజీ, దంగేటి అరుణ కుమార్, పైడికొండల వీరభద్రరావు, మాత నూకారావు, గుబ్బల నాగేంద్ర కుమార్, యాల నరసింహమూర్తి షాజహాన్ పాల్గొన్నారు.

సీనియర్ పాత్రికేయులకు సన్మానం

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

యు కొత్తపల్లి మండలంలో సీనియర్ పాత్రికేయులకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. వాసవి క్లబ్ ఫౌండర్ కల్వకుంట్ల చంద్రసేన గుప్త జయంతిని పురస్కరించుకొని మచ్చికంటి మూర్తి (ఆంధ్రజ్యోతి) వెలుగుల ప్రసాద్ (సాక్షి) చోడిశెట్టి సురేష్ (ఆంధ్రప్రభ)ను ఘనంగా సన్మానించారు. అనంతరం వికలాంగ విద్యార్థులకు టవల్స్, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వాసవి క్లబ్ అధ్యక్షుడు దంగేటి దత్తాత్రేయ, సెక్రటరీ చెన్న విఠల్ బాబు, ట్రెజరర్ కూరగాయల వెంకటరాజు, ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు కూరగాయల రఘు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు

యుటిఎఫ్ రణభేరి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల సాధన కోసం, విద్యారంగ సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జెఎన్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో రణభేరి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ బోధనేతర పనుల భారాన్ని తగ్గించాలని, 12వ పిఆర్‌సి కమిషన్ వెంటనే నియమించాలని, పెండింగ్ డిఎ బకాయిలు విడుదల చేసి కొత్త డిఎ ప్రకటించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15 నుంచి 19 వరకూ బైక్ జాతాలను నిర్వహించి 25న విజయవాడలో భారీ ఎత్తున బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పట్టణ అధ్యక్షుడు ఎస్.సత్యవేణి, ఉపాధ్యక్షుడు జివివి.సత్యనారాయణ, సీనియర్ నాయకులు వెంకట్రావు, ప్రసాద్, శివప్రసాద్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

రైతాంగ సమస్యలపై ధ్వజమెత్తిన సభ్యులు

ప్రజాశక్తి- తాళ్లరేవు

ప్రతి ఏడాదీ సాగునీటి ఎద్దడిపై అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోకపోవడం వల్ల రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు ఎంపిటిసిలు ధ్వజమెత్తారు. ఎంపిపి రాయుడు సునీత అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలతో పాటు, రైతాంగ సమస్యలను సభ్యులు ప్రస్తావించారు. సమస్యలను పరిష్కరించే దిశగా ఆయా విభాగాల అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపిపి సునీత ఆదేశించారు. వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్రప్రసాద్, సర్పంచులు పంపన రామకష్ణ, వెంటపల్లి నూకరాజు, ఎంపిడిఒ సత్యనారాయణ, జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్ పాల్గొన్నారు.